బకాయిలకు మోక్షం కలిగేనా?

- బోధన్ మున్సిపల్ కాంప్లెక్స్ అద్దె వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం
- ఆరు నెలల్లో ముగియనున్న లీజు కాలపరిమితి



బోధన్‌టౌన్(బోధన్): సామాన్యుడు ఆస్తి పన్ను చెల్లించకపోతే నానా యాగి చేసే మున్సిపల్ అధికారులు, తమ సొంత ఆస్తుల అద్దె వసూలుపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సంవత్సరాల తరబడి అద్దె బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోయాయి. బోధన్ మున్సిపాలిటీ ఆర్థికంగా పరిపుష్టి సాధించడానికి, ఆదాయం సమకూర్చేందుకు అప్పటి ప్రభుత్వం 1998లో ఐడీఎస్ఎమ్‌టీ స్కీం నిధులతో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాతో పాటు, పాత బస్టాండ్‌లోని వీక్లీ మార్కెట్‌లో 72 దుకాణ సముదాయాలను రూ. కోట్లు వెచ్చించి నిర్మించింది. అంబేడ్కర్ చౌరస్తాలో నిర్మించిన దుకాణ సముదాయాలతో పాటు వీక్లీ మార్కెట్‌లో ఉన్న దుకాణ సముదాయాలను టెండర్ ప్రాతిపదికన, కాలపరిమితిని విధిస్తు లీజ్‌కు, టెండర్ ప్రక్రియలో పాల్గొని దుకాణాలు సాధించుకున్నవారికి అందించారు.

30 దుకాణాలు.. అద్దె రూ. 24.39లక్షలు..

అంబేడ్కర్ చౌరస్తాలోని 30 దుకాణ సముదాయాల్లో కింద భాగంలో 26 సముదాయాలను 25సంవత్సరాలకు లీజుకు అప్పగించారు. పైభాగంలో గల 4 దుకాణ సముదాయాల్లో మెప్మా కార్యాలయం కొనసాగుతుంది. ఒక్కో దుకాణం అద్దె ప్రస్తుతం రూ. 7,529గా వసూలు చేస్తున్నారు. ఈ యేడాదికి రావాల్సిన అద్దె రూ. 24.30 లక్షలు ఉండగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభం మార్చి నుంచి ఆగస్టు వరకు రూ. 10.16 లక్షలు రావల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు రూ. 2.56లక్షలను మాత్రమే వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 6 నెలలు ఉండగా మిగితా అద్దె బకాయిలు వసూలు దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

పాత బకాయిలు రూ. 6.76 లక్షలు

మున్సిపల్ అధికారుల అద్దెలను ప్రతి నెలా వసూలు చేయకపోవడంతో బకాయిలు రూ. 6లక్షల 76వేలకు చేరింది. మరో 6 నెలల్లో సముదాయాల లీజు ముగియడానికి వస్తున్నా, సంబంధిత శాఖ అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం కనిపించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బల్దియా అధికారులు నిర్లక్ష్యం వీడి మున్సిపల్ దుకాణ సముదాయాల అద్దె వసూళ్లను సకాలంలో వసూలు చేయడంతోపాటు పాత బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అద్దె తప్పనిసరిగా చెల్లించాలి..



పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలోగల బల్దియా దుకాణ సముదాయాల అద్దెను ప్రతీ దుకాణదారుడు తప్పనిసరిగా సకాలంలో చెల్లించాలి. మార్చి నాటికి లీజు గడువు పూర్తవుతుండగా బకాయిలు సైతం చెల్లించాలి. బకాయిలు చెల్లించని వారికి నోటీసులు అందిస్తాం. అయినా చెల్లించని పక్షంలో దుకాణాన్ని సీజ్ చేస్తాము.
– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, బోధన్

అణగారిన వర్గాలకు పార్టీల బాధ్యత అప్పగించాలి





ఆర్మూర్‌లో రాజకీయ పార్టీల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు.. వన్నెల్(బి)లో..

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో ఏడుశాతం లేని అగ్రకులాలు ఏడు పార్టీలకు నాయత్వం వహించడం సామాజిక అన్యాయమే అని, అణగారిన వర్గాలకు పార్టీల బాధ్యతలు అప్పగించాలని ధర్మసమాజ్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్మసమాజ్ పార్టీ, తెలగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం నిజాంసాగర్ కెనాల్‌పై రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి స్థానాన్ని దళితులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు మహిపాల్, రాజు, శ్రీకాంత్, భూమేష్, బద్రి, సాగర్, అనిల్, శ్రీనివాస్, రమేష్, శ్రీహరి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలోని వన్నెల్(బి) చౌరస్తా వద్ద డీఎస్‌పీ(ధర్మ జమాజ్ పార్టీ) ఆధ్వర్యంలో అగ్ర వర్ణ నేతలు నాయకత్వం వహిస్తున్న ఏడు రాజకీయ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు.. సమాజంలో ఏడు శాతం లేని అగ్రవర్ణ నాయకులు, 93శాతం ఉన్న బీసీ, బహుజనులను రాజకీయంగా ఎదగనివ్వడం లేదన్నారు. నాయకులు మహిపాల్, రాజేశ్వర్, మహేశ్, వినయ్, సాయి, రాజెందర్, క్రాంతి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఓటర్ల నమోదును నిలువరించాలి

బోధన్: నియోజకవర్గంలో బోగస్ ఓటర్ల నమోదు ను నిలువరించాలని బీఎస్పీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగాడే పాండు అధికారులను కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నకిలీ ఓటర్ల నమోదుకు య త్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రాంతం వారిని పట్టణ కేంద్రంలో కొత్త ఓటర్లుగా నమోదుకు జరిగిన ప్రయత్నాలను ప్రస్తావించారు. 18సంవత్సరాలు నిండిన వారికి ఎన్నికల కమిషన్ కొత్తగా ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్, సుభాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



కోటగిరి (రుద్రూర్): తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జి దుబాస్ రాములు, మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ తెలంగాణ అవిర్భావం తరువాత సెప్టెంబర్ 17ను అధికారికంగా విలీన దినోత్సవం జరుపుకుందామని మాట ఇచ్చి విస్మరించారని అన్నారు. నాయకులు గంగాధర్, రాములు, శరత్, సున్నం హనుమాండ్లు, శివరాజు, రాజు, నగేష్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళా పరిశీలన



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మెగా మేళాను మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మత్ ఇత్తేషాం (సోహేల్) పరిశీలించారు. మేళాలలో ప్రతిరోజు ఎన్ని స్లాట్‌లు బుక్ చేస్తున్నారని నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం



వర్ని: మండలంలోని వెంకటేశ్వర క్యాంపు గ్రామస్తులు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో మంగళవారం వారు సమావేశం నిర్వహించి రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తూ తీర్మానం చేశారు. తీర్మానం కాపీని గ్రామానికి వచ్చిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా..



బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అండగా ఉంటామని రజక సంఘ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈమేరకు తీర్మాన పత్రాన్ని మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డికి అందజేశారు. జెడ్పీటీసీ తలారి గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు కమాలకర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి



భీమ్‌గల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పార్టీ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లో మంగళవారం ఆయన 'పల్లె పల్లెకు – గుండె గుండెకు కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, 15వేల పెట్టుబడి సాయం, భూమి లేని కూలీలకు రూ. 12వేల సహాయం వంటి పథకాలను అమలు చేస్తామంటు ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయభేరి సభకు జన సమీకరణ

డిచ్‌పల్లి: హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో ఈనెల 17న నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి సభకు రూరల్ నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేయనున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని కేపీఎన్ఆర్ గార్డెన్స్‌లో నేడు నియోజవకర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లద్దె పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి





వన్నెల్(బి)లో సోయాను పరిశీలిస్తున్న అధికారులు.. కళ్యాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

బాల్కొండ: సోయా పంటలో లద్దె పురుగు నివారణ కోసం రైతులు వెంటనే చర్యలు చేపట్టాలని ఏవో మహెందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో మంగళవారం ఆయన సోయా పంటను పరిశీలించారు. పంటలో ప్రస్తుతం అధికంగా లద్దె పురుగు వస్తుందన్నారు. లద్దె పురుగు సోయా ఆకులో పత్రహరితాన్ని పూర్తిగా తినేస్తుందన్నారు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. నివారణ కోసం విషపు ఎరాగా ఒక కిలో బెల్లం, 5కిలోల తవుడు, 250 గ్రాముల లార్విన్ కలిసి సాయంత్రం చల్లాలి. లేదా తయోడికార్బ్ 150 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి, రైతు బందు మండల కోఆర్డినేటర్ రాజేశ్వర్, ఉప సర్పంచ్ కిషన్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్‌లో రైతులు సాగు చేస్తున్న వరి పంటను మంగళవారం బోధన్ ఏడీఏ సంతోష్ పరిశీలించారు. వరిలో బాక్టీరియా, ఎండు ఆకు తెగులు ఎక్కువగా ఉన్నట్లు ఆయన గుర్తించారు. దీంతో నివారణ చర్యలను, మందులను రైతులకు వివరించారు. ఏఈవో కవిత, రైతులు జలయ్య, అశోక్, రాజు, చిన్న రాజు, విశ్వనాథ్‌లు ఉన్నారు.

సంక్షిప్తం

'మట్టి సేకరణ'



పెర్కిట్(ఆర్మూర్): అమృత్ వాటిక స్మృతి వనం కోసం ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు మట్టిని సేకరించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విజయ భారతి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరుగుతూ మట్టిని సేకరించారు. నాయకులు కొత్తూర్ గిరీష్, హరీష్, మనీష్, సురేష్ గౌడ్, రాకేష్, సుభాష్, రాజారెడ్డి, మల్లయ్య, సుదర్శన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన ఆర్మూర్ మండలం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగరాజును మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ పుట్టింటి లింబారెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ



బోధన్/బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో 400 తాగునీటి గ్లాసులను పంపిణీ చేశారు. క్లబ్ కన్వీనర్ రవికిరణ్, అధ్యక్షుడు పాండురంగారావు, కార్యదర్శి బాలగంగాధర్‌రావ్, ప్రతినిధులు ఆదినారాయణ, దాసరి పాపారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వర్ని: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న సహకార సంఘం భవన నిర్మాణా పనులను మంగళవారం చందూరు సొసైటీ చైర్మన్ అశోక్ వెల్లడించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సిబ్బంది సూచించారు. వైస్ చైర్మన్ తారాసింగ్, సొసైటీ డైరెక్టర్లు నిరడి బాలయ్య, భజన్‌లాల్, కవిత అంబర్ సింగ్, సర్పంచులు సత్యనారాయణ, దేవిసింగ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వర్ని: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న సాలూరు రాకేష్‌కు కాంగ్రెస్ నాయకులు మంగళవారం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, రెడ్డి రాంబాబు, మోహినుద్దీన్, మహేందర్, సంజీవ్, సాయిలు, సుధాకర్, బాలరాజు, జమీన్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు తరలిన భక్తులు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్ధులగుట్ట సేవాసమితి సభ్యులు మంగళవారం యాదగిరిగుట్టకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బస్ ఏర్పాటు చేయడంతో సమితి సభ్యులు యాదాద్రికి బయలుదేరారు.

నిరాహార దీక్షకు తరలిన బీపీఎంలు



పెర్కిట్(ఆర్మూర్): తమ సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లోని రాష్ట్ర తపాల శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం చేపడుతున్న ఒక్క రోజు నిరాహారదీక్షకు ఆర్మూర్ మండలంలోని బీపీఎంలు తరలివెళ్లారు. మచ్చర్ల, పెర్కిట్, మంథని బీపీఎంలు రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింభగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమేళా ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని గౌతమ్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం మహిళా ఆరోగ్యమేళాను నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుసేన మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య మేళా నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేస్తామని, మందులు అందజేస్తామని తెలిపారు. సూపర్‌వైజర్ మేరీ హేమలత, ఏపీఎం సత్యనారాయణ, హెడ్ నర్స్ పద్మావతి, ఏఎన్ఎంలు ధనమ్మ, స్వర్ణలత, రాధ, లక్ష్మీ నర్సవ్వ పాల్గొన్నారు .

అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి







డొంకేశ్వర్‌లో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు.. రుద్రూర్‌లో వంటా-వార్పు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు.. బోధన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీలు

డొంకేశ్వర్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్/వర్ని/కమ్మర్‌పల్లి: తమను ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగులుగా చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది. డొంకేశ్వర్‌లో అంగన్‌వాడీ సిబ్బంది తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రుద్రూర్‌లో అంగన్‌వాడీల సమ్మెకు మండల, బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు. ఈక్రమంలో వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. వర్ని, మోస్రా మండల కేంద్రాల్లో సమ్మె శిబిరాలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రుద్రూర్, బోధన్ పోలీస్ స్టేషన్‌లలో అంగన్‌వాడీ సిబ్బంది ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆధీనంలో కేంద్రాలు..

బోధన్‌టౌన్(బోధన్): కలెక్టర్ ఆదేశానుసారం ఐసీడీఎస్ అధికారులు పట్టణంలోని 12 అంగన్‌వాడీ కేంద్రాలను తాళం పగలగొట్టి తెరిచారు. ఆయా కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఆయా వార్డు ఆఫీసర్‌లకు అప్పగించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక రాథోడ్ తెలిపారు.

వర్ని: మోస్రా మండల కేంద్రంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మంగళవారం బోధన్ సీడీపీవో జానకి, మోస్రా ఎంపీడీవో భారతీ సిబ్బందితో కలిసి కేంద్రాల తాళాలు పగలగొట్టి రికార్డులను, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కొత్త తాళాలను కేంద్రాలకు వేసి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాలను త్వరలో తెరవనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.



నికాల్‌పూర్‌లో కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని పలు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను అధికారులు పగులగొట్టి తెరిచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్‌లు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు.



బోధన్ పట్టణంలో..



మోస్రా మండల కేంద్రంలో..

అనాథ పిల్లలకు చేయూత



రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లికి చెందిన యాటల అబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య గతంలోనే మృతిచెందడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లారు. కుమారుడికి తన కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని మాటిచ్చారు. అమ్మాయి చదువుకు సహాకారం అందిస్తానని భరోసా కల్పించారు. కుటుంబ పోషణ కోసం నగదును అందించారు. నాయకులు గోపీక్రిష్ణ, సంతోష్, బుజ్జి(హన్మాండ్లు), శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని, కొల్లూర్, సోంపూర్, టాక్లీ గ్రామాల్లో మంగళవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల శంకర్ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిద గ్రామాల్లో ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు. ఉప సర్పంచ్ మచ్చర్ల కిషోర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎంసీ గంగారెడ్డి, మహేందర్, సొసైటీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండో వార్డులో మంగళవారం కౌన్సిలర్ ఖాందేష్ సంగీత లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సాయినాథ్, నరేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వర్ని: మండలంలోని బేల్యానాయక్ తండాకు చెందిన కేతావత్ గంగారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన భార్య లక్ష్మి,కూతురు బూలీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. బాధితకుటుంబాన్ని మంగళవారం స్పీకర్ పోచారం పరామర్శించి,ఆర్థికసాయాన్ని అందించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	జవాన్(తెలుగు) – 09.50, 10.10 ది నన్2(తెలుగు) – 1.25, 7.35 జవాన్(హిందీ)– 4.00
స్క్రీన్-2 –	మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి –10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 –	ఖుషి – 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-4 –	జైలర్(తెలుగు)– 11.00, 2.35, జవాన్(హిందీ)– 6.10, 9.45

1104 యూనియన్ స్థలం పరిశీలన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో 1104 యూనియన్ సంఘం స్థలాన్ని మంగళవారం 1104 యూనియన్ రాష్ట్ర నాయకులు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌లో జిల్లా సర్వసభ్య సమావేశానికి వెళుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మ పద్మారెడ్డి, మాజీ కోశాధికారి చిన్నస్వామి, ఎన్‌పీడీసీఎల్ డిస్కమ్ అధ్యక్షుడు రఘునందన్‌లు మంగళవారం ఆర్మూర్‌లో 1104 యూనియన్ నాయకులతో మాట్లాడారు. అనంతరం యూనియన్‌కు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సంఘానికి కెటాయించిన స్థలాన్ని పరిశీలించారు. నాయకులు సంజీవ్, ప్రధానకార్యదర్శి నరేందర్‌నాయక్, ప్రదీప్‌గౌడ్, గంగారాం, నాగభూషణం, రమేష్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గన్నారు.